# రేపటి నుంచే ఎప్‌సెట్ పరీక్షలు

- 4, 5 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ టెస్ట్
- 9 నుంచి 11వ వరకు 6 సెషన్లలో ఇంజనీరింగ్ పరీక్షలు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం: కన్వీనర్ కె.విజయకుమార్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం మే 4, 5 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాలకు, మే 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ అభ్యర్థులకు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను రోజుకు రెండు సెషన్ల చొప్పున నిర్వహిస్తున్నారు. ఉదయం సెషన్ 9-12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. సోమ, మంగళవారాల్లో జరగనున్న అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలకు మొత్తం 3 సెషన్లకు గాను 90,958 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, అభ్యర్థులు సమయపాలన విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, పరీక్ష ప్రారంభ సమయానికి నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించే ప్రసక్తే లేదని సెట్ అధికారులు స్పష్టం చేశారు. ఉదయం సెషన్ అభ్యర్థులను 7.30 గంటల నుంచి, మధ్యాహ్నం సెషన్ అభ్యర్థులను 1.30 గంటల నుంచే పరీక్షాకేంద్రంలోనికి అనుమతిస్తారు. పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులు తాము సాధించిన మార్కులను స్క్రీన్‌పై చూసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్/రేషన్ వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి (ఒరిజినల్) తప్పనిసరిగా తెచ్చుకోవాలి. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎప్‌సెట్ కన్వీనర్ కె.విజయకుమార్ రెడ్డి తెలిపారు.

# జేఎన్‌టీయూలో నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో ఆదివారం జరగనున్న నీట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్, సైన్స్ విభాగాలతో పాటు గోల్డెన్ జూబ్లీ భవనం, క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లో మొత్తం 5 సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 1,308మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. శనివారం ఎన్‌టీఏ ప్రతినిధుల పర్యవేక్షణలో ఐదు సెంటర్లలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు బిగించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రఘురాం ఏర్పాట్లు పర్యవేక్షించారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5వరకు పరీక్ష జరగనుంది. ఉదయం 11గంటల నుంచే క్యాంపస్‌లోకి విద్యార్థులకు అనుమతివ్వనున్నారు. ముందుగా వచ్చిన విద్యార్థుల పేర్ల నమోదు, బయోమెట్రిక్ తదితర ప్రక్రియ పూర్తిచేసిన తర్వాత 1.30గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 1.40తర్వాత వచ్చే వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతివ్వమని అధికారులు వివరించారు.